
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం ၊ 19 ၊ జూన్ ၊ 2025



సోమశిలలో 36.797టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 36.797 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 3,330, ఉత్తర, దక్షిణ కాలువలకు 1,075 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,02,380
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,257
3 శాతం జీఎస్టీతో	రూ.9,535
నవర (8 గ్రా)	రూ.76,280

గరిష్టం/కనిష్టం
38.1 /29.5

వాతావరణం

జిల్లాలో గురువారం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండి ఉక్కపోతగా ఉండనుంది. బుధవారం గాలిలో తేమ 45 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

132 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

నెల్లూరు (టౌన్): స్థానిక వెంకటేశ్వపురంలోని ప్రభుత్వ బాలికల ఐటీఐలో బుధవారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో బాలికల ఐటీఐతోపాటు సంగం, ఏఎస్‌పేటల్లోని ప్రభుత్వ ఐటీఐలో చదువుతున్న 160 మంది విద్యార్థులు హాజరు కాగా రాత పరీక్ష, ఇంటర్వ్యూలు అనంతరం 132 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఏడుకొండలు తెలిపారు. ఈ డ్రైవ్‌లో బ్లూస్టార్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్, ఏంపినోల్ తదితర కంపెనీ ప్రతినిధులు హాజరైనట్లు చెప్పారు.

మరో ఇద్దరికి కరోనా



నెల్లూరు (అర్బన్): జిల్లాలో మరో ఇద్దరికి కరోనా నిర్ధారణ అయింది. కోవూరు పట్టణానికి చెందిన 40 ఏళ్ల మహిళ, నెల్లూరు నగరంలోని జెడ్పీ కాలనీకి చెందిన 60 ఏళ్ల విశ్రాంత అధికారి జ్వరం, జ్వరం, గొంతునొప్పి లక్షణాలతో బాధపడుతూ పెద్దాస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నారు. వారికి బుధవారం కరోనా నిర్ధారణ అయింది. స్వల్ప లక్షణాలు ఉండడంతో వారిని హోం ఐసోలేషన్‌లో ఉంచి వైద్యశాఖాధికారులు పర్యవేక్షిస్తున్నారు. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు కరోనా కేసులు 14కి చేరాయి.

కాకాణి బెయిల్ పిటిషన్‌పై తీర్పు రేపు

నెల్లూరు (లీగల్): పొదలకూరు పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ ఐదో అదనపు జిల్లా (ప్రత్యేక ఎస్సీ ఎస్టీ.)కోర్టులో బుధవారం పూర్తయింది. పోలీసుల తరఫున స్పెషల్ పీపీ విజయమ్మ తమ వాదనలు వినిపించారు. కాకాణి తరఫున సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి ఇప్పటికే వాదనలు వినిపించారు. ఉభయుల వాదనలు పూర్తికావడంతో కోర్టు న్యాయమూర్తి సరస్వతి తుది తీర్పు శుక్రవారానికి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎరువుల కొరత లేదు

- జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి




సంగం: జిల్లాలో 3 లక్షల ఎకరాల్లో వరిసాగు జరుగుతుందని, అందుకు అవసరమైన ఎరువులు సిద్ధం చేస్తున్నామని, ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి తెలిపారు. మండలంలోని తలుపురుపాడు పంచాయతీ కార్యాలయంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు పంటల సాగు, నీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రస్తుతానికి 11 వేల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించామన్నారు. గోదాముల్లో 1,690 మెట్రిక్ టన్నుల యూరియా, 350 మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వ ఉందన్నారు. రైతులు నానో యూరియా, డీఏపీ వాడాలని కోరారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాజున్ని, సంగం సాగునీటి సంఘం అధ్యక్షుడు షేక్ బాబు, వ్యవసాయ శాఖ ఏడీఏలు నర్సోజీ, అనిత, వ్యవసాయాధికారి శశిధర్, వ్యవసాయ విస్తరణాధికారి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సుఖీభవ కొందరికే!

- అన్నదాత పథకానికి కోత
- 3.19 లక్షల మంది రైతుల దరఖాస్తు
- 1.77 లక్షల మందిని అర్హులుగా గుర్తించిన ప్రభుత్వం
- కౌలు రైతులకు పంగనామాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2,14,667 మందికి రైతు భరోసా
- రేపు పీఎంకిసాన్ సాయంతో కలిపి వేస్తామని చంద్రబాబు హామీ
- పథకం అమలుపై ఇప్పటికీ స్పష్టత లేదంటున్న వ్యవసాయశాఖాధికారులు





అంతన్నాడు.. ఇంతన్నాడు.. ఆఖరికి కొందరికే అన్నదాత సుఖీభవ అంటున్నాడు. వ్యవసాయం దండగ అని విమర్శించిన చంద్రబాబు తిరిగి అధికారంలోకి రావడానికి గతంలో రైతులకు రుణమాఫీ అంటూ మోసం చేశారు. చంద్రబాబు చరిత్రలో రైతుల కోసం ఎలాంటి పథకాన్ని అమలు చేయలేదు. తాజాగా జరిగిన ఎన్నికల్లోనూ అధికారం చేజిక్కించుకునేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవగా పేరు మార్చి ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని హామీలు గుప్పించారు. అధికారం దక్కగానే గతేడాది ఎగనామం పెట్టిన చంద్రబాబు ఈ ఏడాది వచ్చే సరికి నాలిక మడతేసి, పీఎం కిసాన్ మొత్తాన్ని మినహాయించి రూ.14 వేలు ఇస్తామంటూ ఆఖరి రాగం పాడేశారు. గత ప్రభుత్వంలోని లబ్ధిదారుల్లో నిబంధనల పేరుతో కొర్రీలు పెట్టి వేలాది మందిని తొలగించేశారు. కౌలు రైతులను ఆదుకుంటానని.. జాబితా నుంచే లేపేశారు.

నెల్లూరు (పొగతోట) : కూటమి అధికారంలోకి వచ్చి అన్నదాతల ఆశలను చిదిమేసింది. ఆరుగాలం పండించిన పంటలకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కూడా దక్కక రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయారు. సాగు పెట్టుబడిగా అన్నదాత సుఖీభవ పథకంతో ఏడాదికి రూ.20 వేలు ఇస్తామంటూ ప్రచారం చేసి తొలి ఏడాదిలోనే హామీని తుంగలో తొక్కేశారు. తాజాగా పీఎంకిసాన్ మొత్తాన్ని మినహాయించి రూ.14 వేలు మూడు విడతల్లో ఇస్తామని ఇటీవల చంద్రబాబు ప్రకటించారు. అయితే ఏ విడతలో ఎంత ఇస్తారు.. అసలు పీఎం కిసాన్ నిధులు విడుదల చేసిన రోజే ఇస్తారా? లేదా? అనే విషయంలో వ్యవసాయశాఖాధికారులకే నేటికీ స్పష్టత లేదని తెలుస్తోంది.

వైఎస్సార్ రైతు భరోసా పథకం.. జగన్ బ్రాండ్

చంద్రబాబు గతంలో 14 ఏళ్ల సీఎంగా ఉన్నప్పటికీ ఏనాడు అన్నదాతల కోసం ఎలాంటి పథకాన్ని అమలు చేయలేదు. ఆర్థికంగా ఆదుకున్నది లేదు. అధికారంలోకి వచ్చిన ప్రతి సారి రైతులను వంచనకు గురి చేసిన చరిత్ర చంద్రబాబుకు మాత్రమే ఉంది. 2004 ముందు వ్యవసాయాన్ని నిర్వీర్యం చేశారు. వ్యవసాయమే దండగ అని వ్యాఖ్యానించిన చంద్రబాబు, 2014 ఎన్నికల్లో రైతులకు సంపూర్ణ రుణమాఫీ చేస్తానని నిలువునా మోసం చేశారు. తాజా ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన వైఎస్సార్ రైతు భరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవ పథకంగా మార్పు చేసి ఆర్థిక సాయం అందిస్తామని చెబుతున్నారు.

కౌలు రైతులు అవుట్

అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి 2025–26 ఆర్థిక సంవత్సరానికి 3.19 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వివిధ రకాల కారణాలు చూపి వారిలో 1.77 లక్షల మందిని మాత్రమే అర్హులని తేల్చి చెప్పారు. ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ ఇస్తామని హామీలిచ్చినా.. చివరికి గత ప్రభుత్వంలోని అర్హుల్లో సుమారు 50 వేల మందిని తొలగించారు. కౌలు రైతులు అయితే ఈ పథకానికే అర్హులే కాదంటూ విస్మమం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చివరి సంవత్సరంలోనూ 2,14,667 లక్షల మందికి వైఎస్సార్ రైతు భరోసా పథకం సాయం అందించింది. చంద్రబాబు చరిత్ర చూస్తే.. గతంలో రైతులందరికీ సంపూర్ణ రుణమాఫీ అని ప్రచారం చేసి, అధికారంలోకి రాగానే ఒక కమిటీ వేసి నిబంధనలు పెట్టి కొర్రీలు వేసి లక్షల మంది రైతులను తొలగించారు. బ్యాంకుల్లో పెట్టి బంగారాన్ని తిరిగి ఇస్తానని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిబంధనలు పెట్టి బంగారాన్ని వేలం వేసి దగా చేశారు. రుణం మొత్తాన్ని ఐదు విడతల్లో ఇస్తామని ఒకటి.. రెండు విడతలు ఇచ్చి మిగతావి ఎగనామం పెట్టారు.

నిబంధనలతో కొర్రీలు

ఈకేవైసీ, ఆధార్‌లింక్, బ్యాంకు అకౌంట్ లింకు కాలేదంటూ తదితర కారణాలు చూపి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో రైతులను అనర్హులుగా ప్రకటించారు. ఆర్‌జీఎస్ వ్యాలిడేషన్ తర్వాత అర్హులైన రైతులు 1.77 లక్షల మందేనని జిల్లా వ్యవసాయ అధికారులు లెక్కలు తేల్చారు. రైతులు రైతుభరోసా కేంద్రాలకు వెళ్లి వేలిముద్ర వేయాల్సి ఉంది. ఓటీపీ చెప్పాల్సి ఉంటుంది. వీటిపై అవగాహన లేక వేలాది మంది రైతులు వేలిముద్ర వేయలేదు. వారికి అవగాహన కల్పించడంలో సర్కారు పూర్తిగా విఫలమైంది. సర్కారు నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది రైతులు అన్నదాత సుఖీభవకు దూరమయ్యారు. జిల్లాలో అన్నదాత సుఖీభవ మార్గదర్శకాల ప్రకారం రైతు కుటుంబానికి ఒక్కరికి మాత్రమే సంవత్సరానికి రూ.20 వేలు మూడు దఫాలుగా పీఎం కిసాన్‌తో కలిపి అందించనున్నారు. ప్రకటించిన సాయం ఎప్పుడొస్తుందో తెలియక దయనీయ స్థితిలో రైతులు ఉన్నారు. ప్రస్తుతం ఈకేవైసీ, థంబ్ వేసేందుకు రైతులకు మరో పర్యాయం అవకాశం ఇస్తామని వ్యవసాయ శాఖాధికారులు ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే ప్రభుత్వం మరొక పర్యాయం ఈకేవైసీ థంబ్ వేసేందుకు అవకాశం కల్పించే అవకాశాలు లేనట్లు కనిపిస్తున్నాయి.

వైఎస్సార్‌సీపీ పాలనలో ఇచ్చిన రైతు భరోసా

సంవత్సరం	మొత్తం రైతులు	ఆర్థిక సాయం (రూ.కోట్లల్లో)
2019-20	2,02,306	273.11
2020-21	2,43,502	328.72
2021-22	2,43,911	329.27
2022-23	2,14,667	289.80
2023-24	2,14,667	289.80

1.77 లక్షల మంది అర్హులు

అన్నదాత సుఖీభవకు జిల్లా వ్యాప్తంగా 3.19 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ పథకం మార్గదర్శకాల ప్రకారం 1.77 లక్షల మంది అర్హులుగా గుర్తించడం జరిగింది. ప్రభుత్వం ఆదేశాలిస్తే మరో పర్యాయం రైతుల నుంచి ఈకేవైసీ థంబ్ వేయించి రైతులను అర్హుల జాబితాలో చేరుస్తాం. ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నాం.

– సత్యవాణి, వ్యవసాయశాఖ అధికారిణి

అన్నదాత సుఖీభవ జాబితాలో పేరు లేదు



గత ప్రభుత్వంలో ప్రతి ఏటా రైతు భరోసా పథకం ద్వారా నగదు అందింది. ప్రస్తుతం అన్నదాత సుఖీభవ జాబితాలో నాపేరు లేదు. గతంలో రైతు భరోసా, పీఎం కిసాన్ నగదు వస్తుండగా ఇప్పుడు ఎందుకు ఆపారో అర్థం కావడం లేదు. చంద్రబాబు ఏటా రూ.20 వేలు ఇస్తామన్నారు. గతంలో లబ్ధిదారులుగా ఉన్న నేను ఇప్పుడు ఎందుకు అనర్హురాలిని అయ్యానో అధికారులు చెప్పడం లేదు.

– అలవల రాధ, కృష్ణారెడ్డిపాళెం, కలిగిరి మండలం

మాకూ 'తల్లికి వందనం' అమలు చేయాలి

- కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నెల్లూరు (బృందావనం): తమకు తల్లికి వందనంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు బుధవారం ధర్నా చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వైఓ నందన్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పెంచలనరసయ్య, సీఐటీయూ రూరల్ అధ్యక్షుడు కొండాప్రసాద్ మాట్లాడుతూ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ పారిశుధ్య కార్మికులందరికి తల్లికి వందనం అమలు చేయాలని సర్క్యులర్ జారీ చేసిన ఇప్పటికీ దరఖాస్తులు తీసుకోవడం లేదన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, వీరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ఎవరూ చేయని విధంగా మున్సిపల్ కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి పనులు చేస్తున్నారన్నారు. వీరందరూ దళితులు, గిరిజనులన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. నిరసనలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సుజాతమ్మ, వజ్రమ్మ, లక్ష్మీ, చెన్నయ్య, బుజ్జమ్మ, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షలో బదిలీలకు గ్రీన్ సిగ్నల్

నెల్లూరు (టౌన్): సమగ్ర శిక్షలో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ నోటిఫికేషన్ విడుదలైంది. రిక్వెస్ట్, మ్యూచువల్ ఉద్యోగులు, సిబ్బందికి మాత్రమే బదిలీలు నిర్వహించనున్నారు. ఈ నెల 28న తుది సీనియారిటీ జాబితా ప్రదర్శన, 30వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వనున్నారు. సమగ్రశిక్షలో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విభాగంలో కేజీబీవీల్లో టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ పర్సన్స్, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్, క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్స్, మండల స్థాయి అకౌంటెంట్లు, సైట్ ఇంజినీర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్స్, ఆఫీసు సబార్డినేటివ్ ఉద్యోగులను బదిలీ చేయనున్నారు.

ఏఎన్‌ఎం బదిలీల్లో సిఫార్సు లేఖలు

- అర్హులకు అన్యాయం



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ సుజాత

నెల్లూరు (అర్బన్): జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో జరుగుతున్న సాధారణ బదిలీల్లో సిఫార్సులతో అర్హులకు అన్యాయం జరిగింది. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ఏపీఎన్‌జీఓ, ఏపీ జీఈఏ వంటి యూనియన్ల ఆఫీసు బేరర్లకు ప్రాధాన్యత ఉంది. ఈ అవకాశాన్ని అడ్డు పెట్టుకుని ఆఫీసు బేరర్ల కాని వారికి కూడా యూనియన్ల నేతలు రూ.10 వేల నుంచి రూ.20 వేలు వరకు డబ్బులు వసూలు చేసి సిఫార్సు లేఖలు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో సీనియర్లకు తీవ్ర నష్టం జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. యూనియన్ల నాయకులు ఇష్టారాజ్యంగా లేఖలు ఇవ్వడంతోనే సీనియారిటీ ఉన్న వారికి దూరంగా.. జూనియర్లకు దగ్గరగా వచ్చారని తెలుస్తోంది. మరో వైపు సీనియారిటీ జాబితా తయారీలోనూ లొసుగులున్నాయనే ఆరోపణలున్నాయి. బుధవారం జరిగిన ఏఎన్‌ఎం బదిలీల్లో సబ్ సెంటర్లలో పనిచేసే వారి సీనియారిటీని ప్రాతిపదికగా తీసుకోవాలి. అయితే కొన్నిచోట్ల తప్పులు దొర్లాయి. ఒక చోట పీహెచ్‌సీని ప్రాతిపదికగా తీసుకుని అక్కడి యూడీసీ సీనియారిటీ జాబితాను వైద్యశాఖకు పంపించారు. అందులో ఒక ఏఎన్‌ఎం పేరు 13వ స్థానానికి వచ్చింది. ఈ లోపాన్ని గుర్తించిన వైద్యశాఖాధికారులు మళ్లీ సబ్‌సెంటర్ ప్రాతిపదికగా మరో జాబితాను తయారు చేశారు. దీంతో ఆ ఏఎన్‌ఎం 13వ స్థానం నుంచి ఏకంగా 108 స్థానానికి వెళ్లిపోయారు. ఇదెలా సాధ్యమని ఆ ఏఎన్‌ఎం ప్రశ్నిస్తున్నారు. అనుమానాలు, అధికారుల వివరణలతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కౌన్సెలింగ్ జరిపి బదిలీలు చేశారు. 135 ఏఎన్‌ఎంలు, 5 మంది రిక్వెస్ట్ డాక్టర్లకు బుధవారం కౌన్సెలింగ్ జరిగింది.

సీఎం ఇలాకాలోనే మహిళకు రక్షణ ఏదీ?

- రాష్ట్రంలో శాంతిభద్రతలు దారుణంగా క్షీణించాయి
- మహిళలు, ఆడపిల్లలకు భద్రత కరువు
- వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ సునంద



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ సునంద

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వ పాలనలో సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలోనే సామాన్య మహిళలకు రక్షణ లేదని, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీసునంద ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలకు, ఆడపిల్లలకు భద్రత, రక్షణ విషయంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమవుతుందన్నారు. తాజాగా కుప్పంలో శిరీషా అనే మహిళకు జరిగిన ఘోర అవమానానికి కూటమి ప్రభుత్వం సిగ్గుతో తల దించుకోవాలన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలోనే ఇలాంటి ఘటనలు జరిగాయంటే టీడీపీ నేతలు ఎవరి అండ చూసుకుని ఇలా దారుణంగా వ్యవహరించారని ప్రశ్నించారు. బాధితురాలు శిరీషా భర్త తిమ్మరాయప్ప ఓ వ్యక్తి దగ్గర రూ.80 వేలు అప్పు తీసుకుని తిరిగి చెల్లించే క్రమంలో ఆలస్యమవడంతో ఇటువంటి దారుణానికి పాల్పడడం అనాగరిక చర్య అన్నారు. అప్పు ఇచ్చిన మునికన్నప్ప టీడీపీ నాయకుడు కావడంతో అతనిపై తూతూమంత్రంగా చర్యలు తీసుకున్నారన్నారు. టీడీపీ నాయకులు అయితే ఏం చేసినా ఎటువంటి దాడులకు పాల్పడినా చెల్లుబాటు అవుతుందని సీఎం ఈ ఘటనతో స్పష్టం చేశారన్నారు. హోంమంత్రి అనిత తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతి, పార్టీ నాయకులు రోజా, ఇతర నాయకులను తిట్టడంతోపాటు అక్రమ కేసులు పెట్టి వారిని వేధించడంపై చూపే శ్రద్ధ కొంచమైనా మహిళలు, బాలికలను రక్షించడంలో చూపాలన్నారు. ఎన్నికల ముందు పవన్‌కళ్యాణ్ సుగాలి ప్రీతి కేసును అడ్డుపెట్టుకుని మహిళల మీద అన్యాయం జరుగుతుందని ఊగిపోయారని, ఇప్పుడు మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై నోరు మెదపడం లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 188 మంది మహిళలపై అఘాయిత్యాలు, దాడులు జరిగితే పవన్‌కళ్యాణ్ కానీ, బీజేపీ కానీ కనీసం స్పందించకపోవడం బాధాకరమన్నారు. సుమారు 15 మంది మహిళలను హత్య చేస్తే పట్టించుకోవడం మానేసిన ప్రభుత్వం మద్య పానాన్ని, గంజాయిని రాష్ట్రమంతా విస్తరించే పనిలో ఉందన్నారు. ఇకనైనా చంద్రబాబు కళ్లు తెరిచి రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను, అత్యాచారాలను, హత్యలను అరికట్టి మహిళలకు భద్రత కల్పించాలని కోరారు. బాధిత మహిళలకు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం తోడుగా నిలుస్తుందన్నారు. వారి కోసం పోరాటం చేస్తుందని హామీ ఇచ్చారు.

కూటమి పాలనలో 'చేనేత' నిర్వీర్యం

- పేదల సంక్షేమంపై నిర్లక్ష్యం తగదు
- వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఏటా రూ.24 వేల సాయం
- దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జీరక సురేంద్ర



మాట్లాడుతున్న దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జీరక సురేంద్ర

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం చేనేత వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జీరక సురేంద్ర మండిపడ్డారు. చీరాల నుంచి చేనేత సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్న ఆయన బుధవారం నెల్లూరుకు వచ్చారు. మినీ బైపాస్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో చేనేత సంఘ నాయకులతో కలిసి సమస్యలు వాటి పరిష్కారాలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు, పాలక మండళ్లను నియమించాలని డిమాండ్ చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 'నేతన్న నేస్తం' ద్వారా మగ్గం ఉన్న వారికి ఏడాదికి రూ.24 వేలు ఇచ్చి ఆదుకున్నారని, ఆ పథకాన్ని కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకురావాలన్నారు. ఆప్కో చైర్మన్‌ను నామినేట్ చేసే జీఓను ఇంత వరకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. చేనేత వర్గంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడాలన్నారు. ఎన్నికల్లో జీఎస్టీపై హామీ ఇచ్చిన లోకేశ్ ఇప్పటి వరకు దాని గురించి చర్చించకపోవడం విచారకరమన్నారు. ఆకలి చావులు లేకుండా చూడాల్సిన ప్రభుత్వం అభివృద్ధి పేరుతో కొంగ జపం చేస్తుందని, పేదల సంక్షేమం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో చేనేత సొసైటీ మాజీ ఇన్‌చార్జి శీతా సుధాకర్, మాస్టర్ వీవర్ కడవల వెంకటశేషయ్య, చేనేత నాయకులు మదిర దయాకర్ పాల్గొన్నారు.

గంగిశెట్టికి బాలసాహిత్య అవార్డు



గంగిశెట్టి శివకుమార్‌ను సన్మానిస్తున్న పెరుగు రామకృష్ణ, టేకుమళ్ల వెంకటప్పయ్య తదితరులు

నెల్లూరు(బృందావనం): సాహితీ రంగంలో ప్రతిష్టాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం ఈ ఏడాది నెల్లూరీయుడైన డాక్టర్ గంగిశెట్టి శివకుమార్‌ను వరించింది. దాదాపు 57 ఏళ్లుగా ఆయన పడిన సాహితీ సేద్య శ్రమకు ఫలితం దక్కింది. నెల్లూరు జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అధ్యక్షుడు గంగిశెట్టి శివకుమార్ 'కబుర్ల దేవత' కథలు పుస్తకానికి బాలసాహిత్య విభాగంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఈ పురస్కారాన్ని కేంద్రం బుధవారం ప్రకటించింది.

13వ ఏటే సాహితీ ప్రస్థానం

గంగిశెట్టి శివకుమార్ రాపూరులో 1954లో జన్మించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేసి రిటైరయ్యారు. తన 13వ ఏట సాహితీ ప్రస్థానం ఆరంభించిన గంగిశెట్టి బాలల కథలు రాస్తూనే ఉన్నారు. చందమామ, బాలమిత్ర వంటి పిల్లల పత్రికల్లో తెలుగు, ఆంగ్లంలో చంపక్, గోకులం పత్రికల్లో బాలకథలు రాశారు. అమెరికాలోని బాలల కోసం 'మూన్‌బీమ్' (చంద్రకిరణాలు) ఆంగ్ల కథలు రాశారు. తెలుగులో బాలకథలపై పరిశోధన చేసి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి 'డాక్టరేట్' అందుకొన్నారు. చందమామ పత్రికలో సబ్ ఎడిటర్‌గా ఉద్యోగం చేశారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు బాలసాహిత్యానికి సంబంధించి 40 వరకు పరిశోధన పత్రాలు సమర్పణ, బాలబంధు, బాలసాహితీ సామ్రాట్ బిరుదులు పొందారు.

ఘన సన్మానం

ఈ నేపథ్యంలో స్థానిక రిత్విక్‌ఎన్‌క్లేవ్‌లోని శ్రీవేంకటేశ్వర విద్యాలయంలో అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అంతర్జాతీయ కవి డాక్టర్ పెరుగు రామకృష్ణ, ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టేకుమళ్ల వెంకటప్పయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కరుణశ్రీ, కార్యదర్శి అవ్వారు శ్రీధర్‌బాబు తదితరులు ఘనంగా సన్మానించి అభినందించారు.

ఆనందం మాటల్లో చెప్పలేను

ఊహ తెలిసిన నాటి నుంచి చందమామ, బాలమిత్ర కథలు చదివాను. తాను కథలు చదివిన చందమామలో కథలు రాశాను. ఆ పత్రికలో ఉపసంపాదకుడిగా పనిచేశాను. ఆ బాలకథల ద్వారానే బాలసాహిత్యంలో కేంద్రసాహితీ పురస్కారాన్ని అందుకోవడంతో ఈ ఆనందం మాటల్లో చెప్పలేను. ఈ పురస్కారాన్ని తనను బాల్యంలో ప్రోత్సహించిన తల్లిదండ్రులు చిరంజీవి,అంజనాదేవి, విద్యాబుద్ధులు నేర్పిన గురువులతోపాటు దిశానిర్దేశనం చేసి ప్రొఫెసర్ గూడూరు నాగయ్యకుకు అంకితంచేస్తున్నాను. ఈ పురస్కారం కింద నగదుతో పాటు అకాడమీ అవార్డును ఢిల్లీలో రాష్ట్రపతి ద్వారా అందుకోనుండడం సంతోషకరం.

– డాక్టర్ గంగిశెట్టి శివకుమార్

సీఐడీ కేసులో కాకాణికి జూలై 2 వరకు రిమాండ్



నెల్లూరు (లీగల్): సర్వేపల్లి రిజర్వాయర్ నుంచి అక్రమంగా గ్రావెల్ తరలించారని మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని రెండో నిందితుడిగా చేర్చి బాపట్ల పరిధిలోని ఏపీ సీఐడీ సిట్ పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి పీటీ వారెంట్‌పై నెల్లూరు రెండో అదనపు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో సీఐడీ పోలీసులు ప్రవేశ పెట్టారు. సీఐడీ పోలీసులు తరఫున ఏపీపీ లక్ష్మి తమ వాదనలు వినిపించారు. ఈ మేరకు కాకాణికి 14 రోజులు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి శారదారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. కాకాణి తరఫున సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, ఎస్ సుబ్బారెడ్డి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. గత వారంలో ఈ కేసులోని ఆరోపణలు ఎదురుకొంటున్న మొదటి నిందితుడు నిరంజన్‌రెడ్డి రిమాండ్ రిపోర్ట్‌ను తిరస్కరిస్తూ వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేస్తూ న్యాయమూర్తి పాలమంగళం వినోద్ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లో తనిఖీ

పొదలకూరు: పట్టణానికి సమీపంలోని సచివాలయం బిట్ – 4 విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఏడీఎంహెచ్ఓ, టీబీ జిల్లా నోడల్ అధికారి ఖాదర్‌వలీ బుధవారం తనిఖీ చేశారు. క్లినిక్‌లో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగుల వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం పొదలకూరు సీహెచ్‌సీలో ల్యాబ్‌ను పరిశీలించి.. క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఏ మేరకు జరుగుతున్నాయనే అంశాన్ని ఆరాతీశారు. క్షయ సర్వేను నిర్వహిస్తున్నామని తెలిపారు.

కమనీయం.. వెంగమాంబ కల్యాణం

- వీక్షించి.. పరవశించిన భక్తజనం
- నేటితో ముగియనున్న ఉత్సవాలు

దుత్తలూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన నర్రవాడ వెంగమాంబ పేరంటాల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని వెంగమాంబ, గురవయ్య ఉత్సవమూర్తులకు కల్యాణాన్ని నేత్రపర్వంగా బుధవారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన అశేష భక్తజనం వీక్షించి తన్మయత్వం చెందారు. తొలుత విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రధాన ఆలయం నుంచి వేదిక వద్దకు మంగళవాయిద్యాల నడుమ తీసుకొచ్చారు. అమ్మవారికి పట్టువస్త్రాలను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు సమర్పించారు. వెంగమాంబ పుట్టినిల్లయిన వడ్డిపాళెం నుంచి పసుపు, కుంకుమను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో దేవస్థానం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను వేదికపై ఉంచి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణాన్ని పచ్చవ, తుమ్మల, వేమూరి వంశస్తులు జరిపించారు. అనంతరం పల్లకిసేవ నిర్వహించారు.



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



వీక్షిస్తున్న అశేష భక్తజనం



ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా పసుపు, కుంకుమను తీసుకొస్తూ..

అట్టహాసంగా ప్రతానోత్సవం

వడ్డిపాళెంలో హంసవాహనంపై వెంగమాంబ, గురవయ్య ఉత్సవమూర్తులను కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం బాణసంచాను కాలుస్తూ డప్పు, వాయిద్యాల నడుమ ప్రతానోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. దారిపొడవునా అమ్మవారిని భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. నర్రవాడ పురవీధుల మీదుగా సాగింది.

నేటి కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన గురువారం పొంగళ్లు పొంగించడం, ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో బందోబస్తును పోలీసులు ఏర్పాటు చేయనున్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బండలాగుడు పోటీలు



సీతారామపురం : గ్రామదేవత మాతమ్మ తిరునాళ్లలో భాగంగా మండలంలోని సింగారెడ్డిపల్లి అరుంధతీయవాడలో ఎడ్ల బండలాగుడు పోటీలను బుధవారం నిర్వహించారు. ఆత్మకూరు మండలం గొల్లపల్లికి చెందిన మద్దిరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఎడ్లు 20 నిమిషాల్లో 2,106.04 అడుగులు బండను లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. పొట్టేపాళెనికి చెందిన లెనిన్ ఎంటర్‌ప్రైజెస్ వారి ఎడ్లు 20 నిమిషాల్లో 2,067.3 అడుగులు లాగి ద్వితీయ స్థానాన్ని సాధించాయి. గండ్లవీడు, చిన్నమాచనూరుకు చెందిన ఏలూరి సుమంత్‌నాయుడు, మండవ హాజరత్‌నాయుడి ఎడ్లు 20 నిమిషాల్లో 1,526.8.. 1,514 అడుగులు బండలాగి తృతీయ, నాలుగో స్థానాల్లో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.పది వేల చొప్పున నగదు బహుమతులను అందజేశారు.

ట్యాంపరింగ్.. జంబ్లింగ్ విధానానికే విఘాతం

కందుకూరు రూరల్: ఇంటర్మీడియట్ జవాబు పత్రాల ట్యాంపరింగ్ అనేది జంబ్లింగ్ విధానానికే విఘాతమని గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణారావు, డైరెక్టర్ భరద్వాజ్ పేర్కొన్నారు. కాలేజీకి చెందిన అవినాష్‌బాబు, సాయితేజశ్విని జవాబు పత్రాల ట్యాంపరింగ్ విషయమై కళాశాలలో విలేకరులతో బుధవారం వారు మాట్లాడారు. ట్యాంపరింగ్ అంశాన్ని బోర్డు అధికారులు నిర్ధారించి బాధిత విద్యార్థులకు మార్కులను కలిపారని తెలిపారు. దీనిపై సంబంధిత వివేకా జూనియర్ కళాశాలపై బోర్డు అధికారులు విచారణ జరిపి రెండు వారాలు దాటినా, నేటికీ చర్యలను చేపట్టలేదని చెప్పారు. పరీక్ష కేంద్రంగా చూపించిన భవనం ఒకటని, విద్యార్థులతో పరీక్ష రాయించిన షెడ్లు వేరుగా ఉందనే విషయాన్ని విచారణలో ప్రశ్నించారని తెలిపారు. వివేకా కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు కాగా, ఆయన స్థానంలో షాహుల్ హమీద్‌ను అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్‌గా నియమించారని తెలిపారు. వాస్తవానికి బోర్డు ఐడీ తప్పనిసరని, అయితే షాహుల్ హమీద్‌కు ఇది లేదన్నారు. ట్యాంపరింగ్ జరిగిన పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్‌గా పనిచేసిన అధ్యాపకుడ్ని కళాశాల నుంచి తొలగించామని యాజమాన్యం బోర్డు అధికారులకు సమాచారమిచ్చిందని, ఎలాంటి తప్పు చేయకపోతే ఇలా ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. బోర్డుకు సమర్పించిన లేఖలో షాహుల్ హమీద్‌ను ప్రిన్సిపల్‌గా చూపిస్తూ, సంతకం మాత్రం ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లుగా పెట్టి పంపారని తెలిపారు. కారకులపై త్వరితగతిన చర్యలు చేపట్టాలని కోరారు.



మాట్లాడుతున్న రామకృష్ణారావు, భరద్వాజ్

హాస్టల్లో ఉండటం ఇష్టం లేక..

- ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): హాస్టల్లో ఉండి చదువుకోవడం ఇష్టం లేని ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బీవీ నగర్‌లోని ఓ ప్రైవేట్ రెసిడెన్షియల్ కళాశాలలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన రమణయ్య, సునీత దంపతులకు సింధూజ (16), ఇద్దరు కుమారులున్నారు. ఈ క్రమంలో కుమార్తెను బీవీనగర్‌లోని ఓ ప్రైవేట్ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ఎంపీసీలో తండ్రి సోమవారం చేర్చారు. హాస్టల్లో ఉండి చదువుకోవడం ఇష్టంలేక కుమార్తె బాధపడుతోందనే విషయాన్ని గమనించారు. కుమార్తెను ఇంటికి మంగళవారం తీసుకెళ్లి, నచ్చజెప్పి కళాశాలలో బుధవారం వదిలివెళ్లారు. మనస్తాపానికి గురైన ఆమె.. సహచరులు మధ్యాహ్నం భోజనం చేసేందుకు వెళ్లగా, తన గది లోపల గడియపెట్టుకొని సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకున్నారు. భోజనం అనంతరం గది తలుపులను తెరిచేందుకు సహచరులు యత్నించగా, అవి రాకపోవడంతో కళాశాల సిబ్బందికి తెలియజేశారు. బలవంతంగా తలుపు తెరిచి చూడగా, సింధూజ ఉరేసుకొని వేలాడుతూ కనిపించింది. ఆమెను కిందికి దించి హుటాహుటిన చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. విషయాన్ని విద్యార్థిని తల్లిదండ్రులకు కళాశాల సిబ్బంది తెలియజేశారు. వేదాయపాళెం పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేశారు. పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై ముత్యాలయ్య కేసు నమోదు చేశారు.

రెడ్‌క్రాస్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు విరాళం



నెల్లూరు(అర్బన్): పొదలకూరు రోడ్డులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కేన్సర్ ఆస్పత్రి రేడియోథెరపీ విభాగంలో లిఫ్ట్ కోసం రూ.లక్ష చొప్పున విరాళాన్ని ఇద్దరు దాతలు బుధవారం ప్రకటించారు. ఈ క్రమంలో ఈ మొత్తాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డికి నగరానికి చెందిన దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి.. గంగా కన్యాకుమారి అందజేశారు. రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్ జైన్, కేన్సర్ ఆస్పత్రి కో కన్వీనర్ కమలేష్‌జైన్, మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ లక్ష్మి, రేడియోథెరపీ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ గీత ఉషశ్రీ, ఆస్పత్రి జీఎం భక్తవత్సలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవిత ఖైదీల విడుదల

బుక్కరాయసముద్రం: అనంతపురం జిల్లాలోని రెడ్డిపల్లి ఓపెన్ ఎయిర్ జైలు నుంచి నలుగురు జీవిత ఖైదీలు విడుదలయ్యారు. సుప్రీంకోర్టు నిబంధనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 17 మంది జీవిత ఖైదీలను విడుదల చేస్తూ రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులను జారీ చేశారు. ఇందులో నెల్లూరులోని జీనిగిల వీధికి చెందిన చంద్రశేఖర్ విడుదలయ్యారు. వీరికి విడుదల ఆర్డర్ కాపీతో పాటు నూతన వస్త్రాలను అందజేసి సాగనంపామని జైలు సూపరింటెండెంట్ రహమాన్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

మర్రిపాడు: బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కంద్రిక సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. మర్రిపాడు నుంచి ఆత్మకూరు వైపు ద్విచక్రవాహనంపై లింగసముద్రానికి చెందిన సుధాకర్ బయల్దేరారు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పడంతో ఆయన గాయపడ్డారు. క్షతగాత్రుడ్ని డీసీపల్లి టోల్ ప్లాజా అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

గుడ్లూరు: మండల పరిధిలోని జాతీయ రహదారిపై తెట్టు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందారు. మృతుడి వయస్సు 25 నుంచి 30 ఏళ్లలోపు ఉండొచ్చని భావిస్తున్నారు.